
సాక్షి పల్నాడు

ఆదివారం । 23 । మార్చి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 519.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



చేప పిల్లలు విడుదల

విజయపురిసౌత్: అనుపు వద్ద కృష్ణా జలాశయంలోకి మత్స్యశాఖ అధికారులు 10 లక్షల చేప పిల్లలను శనివారం విడుదల చేశారు.



నృసింహుని సేవలో..

మంగళగిరి టౌన్: మాజీ సీఎం ఎన్టీఆర్ తనయుడు మోహనకృష్ణ శనివారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.



పెట్రోలు బొంకులు!

ఒక్కసారి సున్నా చూసుకోండి అని చెబుతూనే వాహనదారులను బంకు నిర్వాహకులు నిండా ముంచుతున్నారు. డబ్బు ఇవ్వడానికి కాస్త చూపు పక్కకు తిప్పితే చాలు చిటికెలోనే పంప్ రీడింగ్‌లో చక్రం తిప్పేస్తున్నారు. రాత్రి వేళ చిప్ మార్చేసి అడ్డగోలుగా దోచుకుంటున్నారు. బంకులోకి అడుగుపెట్టిన వారికి గొంతు తడుపు కొందామన్నా గుక్కెడు నీళ్లు దొరకడం లేదు. అసలు బంకుల్లో కనీస వసతుల సంగతి దేవుడెరుగు.. ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు. వినియోగదారులకు నిర్ణీత కొలత, నాణ్యత విషయంలో గ్యారంటీ లేకుండాపోయింది.

- నున్నా రీడింగ్ అంటూనే నిలువునా మోసం
- ఇంధనం కొలతల్లో సిబ్బంది చేతివాటం
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కరవు
- గాలి నింపే పరికరాలూ అంతంత మాత్రమే
- తీవ్రంగా నష్టపోతున్న వినియోగదారులు
- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో అలంకారప్రాయంగా గాలి నింపే పరికరం

జిల్లాలో మొత్తం బంకులు 210

పెట్రోలు విక్రయం రోజుకు 5.25 లక్షల లీటర్లు

డీజిలు విక్రయం రోజుకు 4.20 లక్షల లీటర్లు

నరసరావుపేట టౌన్: ఉరుకులు పరుగుల జీవితంలో మనిషికి వాహనం తప్పనిసరి. కాలు బయటకు పెట్టాలంటే స్టార్ట్ అనాల్సిందే. అలాంటి తరుణంలో వాహనాలకు ఇంధనం నింపుకొనే విషయంలో వాహనదారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడంపై దృష్టి సారించడం లేదు. పెట్రోలు బంకులోకి వెళితే లైనులో నిలుచున్నామా.. పెట్రోల్ కొట్టించామా.. తిరిగి వచ్చామా అనే లెక్కలో ఉన్నారు. కానీ బంకుల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యజమానులపై ఉందని గుర్తించడం లేదు. వాహనాలకు అవసరమైన గాలి ఫిల్లింగ్ అక్కడే చేయించుకోవచ్చని తెలుసుకోవడం లేదు. అవసరమైతే క్వాలిటీ, క్వాంటిటీ చెకింగ్ చేయొచ్చనే విషయంపై దృష్టి సారించడం లేదు. ఇదే అదనుగా పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు.

ఇవి మీ కోసమే..

ప్రతి పెట్రోల్ బంకులో వినియోగదారులకు ఉచితంగా తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్, గాలి నింపే సౌకర్యం ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. కంపెనీ డీలర్, సిబ్బంది పేరు, ఫోన్ నెంబర్లు ప్రదర్శించాలి. పెట్రోల్, డీజిల్ ధర, ట్యాంక్‌లో ఉన్న నిల్వల వివరాలు, 24 గంటలు నీటి సౌకర్యం కలిగి ఉండాలి. ఈ-సేవలను అందించాలి. శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండాలి. అగ్నిమాపక పరికరాలు, ఇతర భద్రతా ఉపకరణాలు ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంకులో 'నో స్మోకింగ్', ఇతర భద్రతా సూచనలు స్పష్టంగా కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. సరైన కొలతలతో పెట్రోల్, డీజిల్ విక్రయించాలి. వినియోగదారుడు అడిగితే పెట్రోల్ నాణ్యతను చూపించాలి. వీటిలో ఏ ఒక్కటి తేడా వచ్చినా వినియోగదారులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

ప్రభుత్వ బంకులోనే వసతులు శూన్యం

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులోనే కనీస సౌకర్యాలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం 'సాక్షి' సదరు పెట్రోల్ బంకును పరిశీలించగా... గాలి నింపే పరికరం నిరుపయోగంగా దర్శనమిచ్చింది. కొన్ని నెలలుగా ఇది పనిచేయటం లేదు. మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నా అవి కేవలం సిబ్బందికి మాత్రమేనని చెప్పారు. వాహనదారులు వినియోగించటానికి వీలు లేదని సిబ్బంది దురుసుగా సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ బంకుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే ప్రైవేటు బంకుల్లో మరింత దారుణంగా ఉంది. ఎక్కడా మరుగుదొడ్లు లేవు. తాగునీటి వసతి ఉండటం లేదు. కొంతమంది సిబ్బంది పెట్రోల్ నింపే సమయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతల శాఖ పట్టించుకోవడం లేదు.

రాత్రి వేళ మోసం చేస్తున్నారు



పట్టణ శివారులో ఉన్న పెట్రోల్ బంకుల్లో రాత్రివేళ ఇచ్చిన డబ్బులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నింపటం లేదు. అక్కడ పనిచేసే సిబ్బంది సాంకేతికతను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ నాణ్యత చూపించే పరికరం బంకుల్లో అందుబాటులో ఉండటం లేదు. ఏ బంకుల్లో కూడా ఉచితంగా గాలి నింపడం లేదు. మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా యజమానులు ఇచ్చే మాముళ్లో.. లేక ఏ ఇతర కారణమో తెలియదుగానీ చర్యలు మాత్రం తీసుకోవటం లేదు.

– కుంచాల స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు, వినియోగదారుల సంఘం

ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు



పల్నాడు జిల్లాలో మొత్తం 210 పెట్రోలు బంకులు ఉన్నాయి. ఏటా వాటిని పరిశీలించి స్టాంపింగ్ వేస్తున్నాం. దీంతోపాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఈ ఏడాది 36 కేసులు నమోదు చేశాం. రూ.2.70 లక్షల జరిమానా విధించాం. బంకుల యజమానులు విధిగా నిబంధనలు పాటించాలి. వాహనదారులు పెట్రోల్ కల్తీ, పరిమాణంపై అనుమానం ఉండి అడిగితే క్వాలిటీ టెస్ట్ చేసి చూపించాల్సిన బాధ్యత యజమానులదే. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయండి. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– నల్లబోతుల అల్లూరయ్య, అసిస్టెంట్ కంట్రోలర్, పల్నాడు జిల్లా

ఔషధ దుకాణాలపై కొనసాగుతున్న దాడులు



గోదాం వద్ద జిల్లా ఔషధ నియంత్రణ శాఖ జిల్లా అధికారి సునీత, గరుడ బృందం

నరసరావుపేటటౌన్: మాదక ద్రవ్యాలను నిర్మూలించడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఔషధ దుకాణాలపై చేపట్టిన ఆపరేషన్ గరుడ బృందం తనిఖీలు నరసరావుపేటలో రెండో రోజైన శనివారం కూడా కొనసాగాయి. పల్నాడు జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి డి.సునీత ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్, ఏఈఈ శివనారాయణ, ఎఫ్ ఆర్‌ఓ సైదులు, సీఐ పి.రామకృష్ణ పట్టణంలోని బరంపేట్‌లో గల భవ్యశ్రీ మెడికల్ దుకాణానికి సంబంధించి భారీ స్థాయిలో ఔషధాలను అన్ లైసెన్సుడ్ గోదాంలో నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఈ మేరకు అక్కడ తనిఖీలు చేపట్టి రూ.18,40,000 విలువైన ఔషధాలను స్వాధీనం చేసుకున్నట్లు సునీత తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ ఎటువంటి ఎన్డీపీఎస్‌కు సంబంధించి, కాల పరిమితి దాటిన ఔషధాలు, ఫిజిషియన్ శాంపిల్స్ లభించలేదన్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఈగల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఔషధ నియంత్రణ శాఖ, పోలీసు శాఖలతో కూడిన సంయుక్త బృందం దాడులను నిర్వహిస్తుందన్నారు. హై యాంటీబయాటిక్స్, మత్తు కలిగించే మాత్రలను వైద్యుని చీటీ లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హోల్ సేల్ ఏజెన్సీలు, రిటైల్ మెడికల్ షాపులు కొనుగోలుకు సంబంధించి రసీదులను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. అందులో ఎవరైనా పరిమితికి మించి భారీ స్థాయిలో మత్తు బిళ్లలు కానీ, హై యాంటిబయాటిక్స్ కానీ కొనుగోలు చేసినట్లు, డాక్టర్ చీటీ లేకుండా విక్రయించినట్లు పసిగడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

బాజీబాబా దర్గాను సందర్శించిన హైకోర్టు జడ్జి



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విద్యావతి శనివారం పెదకాకాని బాజీ బాబా దర్గాను సందర్శించారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి విద్యావతికి సిబ్బంది దర్గా మర్యాదలతో స్వాగతం పలికారు. దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసిన న్యాయమూర్తి అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గా సిబ్బంది న్యాయమూర్తి విద్యావతిని శాలువాతో సత్కరించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉరుసు మహోత్సవం జరగనున్న నేపథ్యంలో రూ.5వేల నగదు విరాళంగా అందజేసినట్లు దర్గా సిబ్బంది తెలిపారు.

28 అర్జీలు స్వీకరణ



నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీ కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 28 అర్జీలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్వీకరించారు. తక్షణమే సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాల వారి సమస్యల కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రతినెలా నాల్గవ శనివారం ప్రత్యేక పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా వర్గాల ప్రజలు ఉపయోగించుకోవాలి అన్నారు. జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ,, డీఆర్వో ఏకా మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే సహకార సంఘాల లావాదేవీలు



నరసరావుపేట: ఇకపై సహకార సంఘాలలో అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాలని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా శనివారం జిల్లా సహకార బ్యాంక్ ఆవరణలో పీఏసీలు, సీఈవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వాణిజ్య బ్యాంక్‌ల మాదిరి సహకార సంఘాలు పనిచేయాలన్నారు. అవసరమైతే తగిన ఫర్నిచర్ సమకూర్చుకోవాలని తెలిపారు. సభ్యులకు ఆన్‌లైన్ సేవలు అందించాలని చెప్పారు. గో లైవ్‌కు వెళ్లిన అన్ని పీఏసీలు ముందుగా నెట్‌వర్క్ పనితీరును పరీక్షించుకోవాలని చెప్పారు. సభ్యుల డేటా సరిగ్గా నమోదైందో లేదో లాగిన్ చేసి పరిశీలించుకోవాలని కోరారు. సిబ్బందిలో అవసరమైన వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సిస్టమ్ ఆడిట్‌లో భాగంగా అన్ని మాడ్యూల్స్ సరిగ్గా పని చేస్తున్నాయో లేదో పరీక్షించుకోవాలని సూచించారు. రియల్ టైం ఎంట్రీ ప్రారంభించాలని, ఏ రోజుకురోజు ఆన్‌లైన్ లావాదేవీలు సక్రమంగా చేస్తూ సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేందుకు ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. జిల్లాలో 59 పీఏసీలకుగాను 38 పీఏసీలలో గో లైవ్‌కు వెళ్లిన సీఈవోలు, జిల్లా సహకార ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యత అంశాలపై నివేదికలివ్వండి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు
- గోదాములో ఈవీఎంలు పరిశీలన



కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రాధాన్యత అంశాల నివేదికలను తక్షణం సమర్పించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లతో నిర్వహించనున్న కాన్ఫరెన్స్ సందర్భంగా శనివారం ఆయన కార్యాలయంలో అన్ని విభాగాల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించిన ప్రగతి, ప్రధాన సమస్యలను సీఎంకు వివరించేందుకు అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. రాబోయే మూడు నెలల్లో అన్ని శాఖల పరంగా నిర్వహించాల్సిన ముఖ్యమైన కార్యాచరణ ప్రణాళికలను అందించాలన్నారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డులోని గోడౌన్‌లలో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శనివారం తనిఖీ చేశారు. డీఆర్వో ఏకా మురళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలకు నీటిని అందించాలి

నరసరావుపేట రూరల్: మన జీవనాధారమైన నీటిని ఒడిసి పట్టుకొని భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేయనున్న సేద్యపు నీటి కుంట పనులను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆర్డీవో మధులత, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తిలు పాల్గొన్నారు. దాదాపు రూ.43 వేలతో ఏర్పాటు చేయనున్న సేద్యపు నీటి కుంట పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రొంపిచర్ల మండలం విప్పర్లపల్లిలో నీటి కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణవాయువు తరువాత నీరే మనకు ప్రాణాధారమని తెలిపారు. నీటి వనరులను పరిమితమని, జలాన్ని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ బలోపేతమే కేంద్రం లక్ష్యం

- తపాలా శాఖ పథకాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తాం
- కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- సత్తెనపల్లిలో ప్రధాన తపాలా కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన



సత్తెనపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: పోస్టల్ శాఖ బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సత్తెనపల్లి రఘురాంనగర్‌లో తపాలా శాఖకు చెందిన స్థలంలో రూ.2.60 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ప్రధాన తపాలా కార్యాలయ భవన నిర్మాణానికి చేపట్టిన శంకుస్థాపనలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వెంకటేశ్వర గ్రాండ్‌లో తపాలా శాఖ నిర్వహించిన సమావేశంలో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా పోస్టల్ శాఖను ముందుకు తీసుకెళుతున్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాలకు పోస్టల్ శాఖ ద్వారానే చేరుతున్నాయన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలను తీసుకుంటే వందల సంవత్సరాలు వేగవంతంగా వెళుతూ కొన్ని మూతపడుతుంటాయన్నారు. ఎయిర్ ఇండియా పూర్తిగా మూతబడిందన్నారు. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ పోస్టల్ శాఖ నుంచి రూ.11 వేల కోట్లు మాత్రమే ఆదాయం వస్తుందని, ఖర్చులు చూస్తే రూ.38 వేల కోట్లు ఉన్నాయన్నారు. రూ.27 వేల కోట్లు మైనస్‌లో ఉన్నామని, దీనిలో ఎక్కువగా వేతనాలు ఉన్నాయన్నారు. పోస్టల్‌శాఖలో మునుపెన్నడూ లేని విధంగా సీటీఓ, వైస్ ప్రెసిడెంట్‌ను రిక్రూట్ చేశామన్నారు. వారి టెక్నాలజీతో ఉద్యోగులు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. పార్సిల్, డెలివరీ వేగవంతంగా జరగాలని, జవాబుదారీతనం ఉండాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె.ప్రకాష్‌లు మాట్లాడారు. ముందుగా రఘురాంనగర్‌లోని 48 సెంట్ల స్థలంలో ప్రధాన తపాలా కార్యాలయం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అసంఘటిత కార్మికులకు 12 అంకెల గల ప్రత్యేక గుర్తింపు కార్డులు అర్హులకు పంపిణీ చేశారు. మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను పోస్టల్ శాఖ అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్.మూర్తి, నరసరావుపేట డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్థసారథి అలంకారంలో నరసింహస్వామి



పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నరసింహస్వామి

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన లంకా నాగేశ్వరరావు కుమారులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన పచ్చళ్ళ సుబ్రహ్మణ్యం కుమారులు వ్యవహరించారు.

నేడు శ్రీరంగనాయకులు అలంకారం...

లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీరంగనాయకులు అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ఈఓ. రామకోటిరెడ్డి కోరారు.

అక్రమార్జనకు దగ్గరిదారి

- రాజధానిలో రోడ్లను తవ్వేస్తూ మట్టి అక్రమ విక్రయాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రాత్రిళ్లు ఐదు చోట్ల భారీ యంత్రాలతో మట్టి లోడింగ్
- జేబులు నింపుకొంటున్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు, వాహన యజమానులు



కృష్ణాయపాలెం - మందడం రోడ్డులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధానిలో కాంట్రాక్టర్లు, కొంతమంది మట్టి మాఫియా రాబందుల్లా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ ప్రతిరోజు రూ.లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ సచివాలయానికి 5,6 కిలోమీటర్ల దూరంలోని కాజా టోల్‌గేట్ నుంచి గన్నవరం వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి మట్టి తవ్వి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఈ మట్టిని కొంతమంది వ్యాపారులకు లారీ రూ.2వేలకు అమ్ముతుంటే ఆ వ్యాపారులు లారీ రూ.7వేల నుంచి రూ.8 వేలకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. వాస్తవానికి ఈ మట్టిని తరలించేందుకు మైనింగ్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. అయితే సదరు కాంట్రాక్టర్ అవేవీ పట్టించుకోకుండా మట్టిని అమ్ముకోవడం ప్రారంభించారు. ఇదే అదనుగా తీసుకుని కొంతమంది అక్రమార్కులు సైతం రాజధాని ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన రోడ్లను సైతం యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.

పేదలకు ఇచ్చిన స్థలాల్లో సైతం..

గత ప్రభుత్వం పేదలకు నివాసాలుగా ఇచ్చిన స్థలాల్లో రోడ్లను సైతం కొన్ని చోట్ల తవ్వేశారు. రాత్రిళ్లు ఆ రహదారిపై మట్టిని తవ్వి ఒక ప్రాంతంలో డంపింగ్ చేసి ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసి అమ్ముకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాల విషయంలో ఈ మధ్యకాలంలో పలు కేసుల్లో నమోదైన ఓ వ్యక్తి ఈ తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాజధాని గ్రామాలైన కృష్ణాయపాలెం శివారు, వెంకటపాలెం, మందడం శివారు ప్రాంతాల్లో, కొండవీటి వాగు రోడ్డుకు సంబంధించిన మట్టిని రాత్రికి రాత్రి వందల సంఖ్యలో లారీలు పెట్టి బయటకు తరలిస్తున్నారు. ఐదు గ్రూపులుగా ఏర్పడి ఎవరికి వారు పొక్లెయిన్లు తీసుకువచ్చి వారంతట వారే హద్దులు నిర్వహించుకుని మట్టి తవ్వకాలు నిర్వహించి జేబులు నింపుకొంటున్నారు.

కనిపించని పర్యవేక్షణ

రాజధానిలో వివిధ పనులు నిర్వహించేందుకు వందలాది కంపెనీలు టెండర్లు దక్కించుకుని కాంట్రాక్ట్ వర్క్స్ చేస్తున్నాయి. పనులు నిర్వహించే దగ్గర ఎటువంటి సెక్యూరిటీని నియమించడం లేదు. దాంతో సూపర్‌వైజర్స్‌గా వ్యవహరించే వారు అక్రమాలకు పాల్పడుతూ రాజధానిలో సంపదను దోచుకుంటు జేబులు నింపుకొంటున్నారు. మట్టిని రాజధాని ప్రయోజనాలకు కాకుండా వివిధ ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా, లారీల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

నిబంధనలకు నీళ్లు

రాజధాని ప్రాంతంలో నిర్వహించే పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లు వదిలి తమ లాభార్జన కోసం పనిచేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. దీనికి నిదర్శనం కాజాటోల్ వద్ద నుంచి గన్నవరం వరకు నిర్మించే రహదారిలో కాజా టోల్‌గేట్‌వద్ద నుంచి వెంకటపాలెం శివారు వరకు రోడ్డు నిర్మించేటప్పుడు తవ్వే మట్టిని నిబంధనలకు విరుద్ధంగా అమ్ముకోవడమే. సదరు కాంట్రాక్టర్లు అవినీతికి దారి చూపడంతో కొంతమంది స్వార్థపరులు రాజధానిలో నిర్మించిన రహదారులను సైతం తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రాజధానిలో చేపట్టిన అభివృద్ధి పనులపై నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలలో బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జువెనైల్ జస్టిస్ బోర్డులో చైర్మన్, సభ్యులుగా సేవలు అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యవేక్షణ అధికారి బి.ఏ.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఏప్రిల్ 9వతేది లోగా స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు తిరస్కరించబడతాయని స్పష్టం చేశారు. వివరాలకు http//wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ కాలమ్ నుంచి తెలుసుకోవచ్చన్నారు. జిల్లా పర్యవేక్షణ అధికారి, 9100045422 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

నోటి క్యాన్సర్ నివారణకు కృషి చేయాలి

- రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ టి.కృష్ణబాబు
- సిబార్‌లో జాతీయ దంత వైద్య సదస్సు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న డాక్టర్ టి.కృష్ణబాబు

పెదకాకాని: ప్రభుత్వం ఆధ్వర్యంలో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ టి.కృష్ణబాబు అన్నారు. ఓరల్ మెడిసిన్, ఓరల్ పథాలజీ, ఓరల్ సర్జరీ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా నోటి క్యాన్సర్ నివారణకు కృషి చేయాలన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులోని సిబార్ దంత వైద్య కళాశాల గత రెండు రోజులుగా జరిగిన జాతీయ దంత వైద్య సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుకు సిబార్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. అంతర్జాతీయ ఓరల్ పథాలజీ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ కె.రంగనాథన్ గౌరవ అతిథిగా విచ్చేశారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ టి.కృష్ణబాబు మాట్లాడుతూ సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్య సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఓరల్ క్యాన్సర్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, ఓరల్ మెడిసిన్, రేడియాలజీ, ఓరల్ సర్జరీ రంగాలకు చెందిన ప్రముఖ వైద్యులు, శాస్త్రవేత్తలు వక్తలుగా విచ్చేసి వారి అనుభవాలను తెలియజేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు దేశ నలుమూలల నుంచి 500 వరకు ఓరల్ మెడిసిన్, ఓరల్ పథాలజీ, ఓరల్ సర్జరీ నిపుణులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణ, కార్యదర్శి డాక్టర్ శివ ప్రసాద్, ట్రెజరర్ డాక్టర్ అవినాష్ తేజస్వి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సమత, ట్రెజరర్ డాక్టర్ సేతు మంజూష, సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ పూర్ణ చంద్రరావు నాయక్, సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సంస్కృతం పరీక్ష

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలో 79 కేంద్రాలలో నిర్వహించిన సంస్కృతం(ఓఎస్ఎస్‌సీ) పరీక్షకు 3,623 మంది విద్యార్థులకు గాను 3,608 మంది హాజరయ్యారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు 11 సిట్టింగ్ స్క్వాడ్, 6 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మండలంలోని 5 కేంద్రాలను, జిల్లా పరిశీలకులు ఎన్.గీత సత్తెనపల్లి పట్టణంలోని 8 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 42 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రవి



నరసరావుపేట: ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని ప్రజలందరూ ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకుంటూ వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.రవి కోరారు. ఈ మేరకు శనివారం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మీడియాకు వివరించారు. తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం కలిగియుండటం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి కలిగి ఉంటే వడదెబ్బ తగిలినట్లుగా భావించాలని చెప్పారు. అటువంటి వారిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలని, తడి గుడ్డతో శరీరం రుద్దుతూ ఉండాలని, ఐస్ నీటిలో బట్టను ముంచి శరీరం తుడవాలని అన్నారు. శరీర ఉష్ణోగ్రత 101– డిగ్రీస్ కంటే లోపునకు వచ్చేవరకు ఐస్ వాటర్ బట్టతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలని, వడదెబ్బకు గురైనవారు సాధారణ స్థితికి రాకుంటే వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.


రక్షణ ఇలా...

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రాలను ధరించాలని, నెత్తికి టోపీ లేదా రుమాలు కట్టుకోవాలని, వీలైనంతవరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించాలని సూచించారు. దాహం వేయకపోయినా తరచుగా నీటిని తాగుతూ ఉండాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిసిన నీటిని తాగవచ్చునని చెప్పారు. మంచినీరు ఎక్కువ సార్లు తాగాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాస్ మంచి నీరు, ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు లేదా చల్లని నీరు తాగాలని, తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తలతిరగటం లాంటి ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలో ఉన్న వైద్యుణ్ణి సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని అన్నారు. సూర్యకిరణాలు, వేడిగాలికి శరీరంపై పడకుండా ఉంచుకోవాలని, సూర్యకాంతిలో గొడుగు లేకుండా తిరుగరాదని, నలుపు రంగు దుస్తులు మందంగా ఉండే దుస్తులు ధరించకుండా ఉంటే మంచిదని అన్నారు. ఎండలో బయట నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె తీసుకొన కూడదని అన్నారు. శీతలపానీయం, మంచు ముక్క వంటివి తీసుకొంటే గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని డీఎంహెచ్ఓ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో యడ్లపాడు మండలం వంకాయలపాడుకు చెందిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన అనకాపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. మండలంలోని వంకాయలపాడుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ మస్తాన్‌వలి(62) మూడు రోజుల కిందట వైజాగ్‌కు లోడు తీసుకుని వెళ్లాడు. వైజాగ్ నుంచి ఐరన్ లోడ్‌తో తిరుగు ప్రయాణంలో ఉన్న లారీ, శుక్రవారం అర్ధరాత్రి అనకాపల్లిలో మరో లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసం కాగా, మస్తాన్‌వలి నడిపే లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో మస్తాన్‌వలి డ్రైవర్ సీట్లోనే ఇరుక్కుపోయాడు. అక్కడిక్కడే మృతి చెందాడు. ఏడాదిన్నర క్రితం భార్యను కోల్పోయిన మస్తాన్‌వలి, ఇద్దరు సంతానంలో ఒక కుమార్తె కూడా కొద్దికాలం కిందట మృతి చెందింది. ప్రస్తుతం మరో కుమార్తె, అల్లుడు వంకాయపాడు గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. డ్యూటీకి అని వెళ్లిన తన తండ్రి విగతజీవిగా మారాడన్న వార్త విన్న కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించింది.


మృతుడు మస్తాన్‌వలి

కృష్ణానదిలో పడి వ్యక్తి మృతి


రామ్‌కుమార్ మృతదేహం

అచ్చంపేట: కృష్ణానదిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కోగంటివారిపాలెంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు మండలంలోని ఓర్వకల్లు గ్రామానికి చెందిన కోట జయరావు, సరోజినీల కుమారుడు రామ్‌కుమార్ (28) తన స్నేహితులతో కలసి శనివారం సాయంత్రం 5గంటల సమయంలో సమీపంలోని కృష్ణానదిలో సరదాగా ఈతకొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే నది లోతుల్లో జారి పడిపోయినట్లు తెలిసింది. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. రామ్‌కుమార్ ఇటీవలనే వైద్యునిగా అర్హతపొంది గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అసిస్టెంట్ వైద్యునిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. కుమారుడు అకస్మాతుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లారు. పోలీసుస్టేషన్‌లో ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

చెట్టును ఢీకొట్టిన బైక్.. వ్యక్తి మృతి

మాచవరం: ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నంద్యాల శివయ్య(65) వ్యక్తిగత పనులు ముగించుకొని బ్రాహ్మణపల్లి వైపు నుంచి గంగిరెడ్డిపాలెం వస్తుండగా ద్విచక్ర వాహనం టైరు పంక్చర్ కావడంతో బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో శివయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్టు

ఎమ్మెల్యే ఒత్తిడితోనే అంటున్న కుటుంబ సభ్యులు

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పాతగుంటూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్టు నమోదయింది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు సయ్యద్ ఇంతియాజ్, సయ్యద్ ఫిరోజ్‌లు అన్నదమ్ములు. వీరిపై గత ఎనిమిది సంవత్సరాలుగా రౌడీషీట్ ఉంది. ఈక్రమంలో గత కొద్దిరోజుల క్రితం ఆర్టీసీ కాలనీలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు వీరికి మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌పై వీరు దాడికి యత్నించారు. గతంలో నుంచే టీడీపీలో నసీర్ అహ్మద్, ఇంతియాజ్ కుటుంబీకుల మధ్య వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు ఇంతియాజ్, ఫిరోజ్‌ల సోదరుడు ముజీబ్ కూడా టీడీపీ తూర్పు నియోజకవర్గ సీటును ఆశించి భంగపడ్డారు. దీంతో వీరిమధ్య వివాదాలు మరింత ముదిరాయి. వివాదం విషయాన్ని మనసులో పెట్టుకున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఉద్దేశ్యపూర్వకంగా వీరిపై పీడీ యాక్టు పెట్టించారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు నుంచి అదును కోసం ఎదురు చూస్తున్న ఎమ్మెల్యే వీరికి ఉన్న రౌడీషీట్లను అడ్డుపెట్టుకుని ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశ్యంతో పీడీ యాక్టుతో పావులు కదిపారనే ఆరోపణలు లేకపోలేదు. పీడీ యాక్టు నమోదైన ఇంతియాజ్, ఫిరోజ్‌లను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వెళ్లిన నేపథ్యంలో వారు పరారీలో ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో వారు టీడీపీ అగ్ర నాయకత్వాన్ని కలిసి విషయాన్ని వారికి దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్లు సమాచారం.

సంప్రదాయ కళల పునర్వైభవానికి కృషి చేయాలి

కేంద్ర సంగీత, నాటక అకాడమీ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల పునర్వైభవానికి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర సంగీత, నాటక అకాడమీ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి అన్నారు. శనివారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో ఏర్పాటు చేసిన భవన్స్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. డాక్టర్ రామలింగశాస్త్రి మాట్లాడుతూ ఆధునిక యాంత్రిక జీవనంలో మన పురాతన కళలైన సంగీతం, నాట్యం, చిత్రలేఖనం వంటివి కనుమరుగవుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో భారతీయ విద్యా భవన్స్ ముందుకు వచ్చి సంస్కృతి, లలిత కళల అకాడమీని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి బాల్యం నుంచే సంగీతం, నాట్యం, సాహిత్యం, గానం, చిత్ర లేఖనంవంటి కళలు నేర్చుకొని అద్భుత ప్రతిభావంతులుగా రాణించాలన్నారు. ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ లలిత కళలు మన భారత జీవన గమనంలో భాగమని, పాశ్చాత్య దేశాలు పుట్టక మునుపే మన దేశంలో నలంద, తక్షశిలా వంటి విశ్వవిద్యాలయాల్లో సంగీతం, నాట్యం, చిత్రలేఖనం వంటి అనేక కళల్లో శిక్షణా తరగతులను నిర్వహించి, భావితరాలకు అద్భుత కళారూపాలను అందించారని తెలిపారు. భారతీయ విద్యా భవన్స్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ అనేకమంది ప్రఖ్యాత కళాకారులకు జన్మభూమి అయిన గుంటూరులో అకాడమీను స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి చేతులమీదుగా అకాడమీ లోగోని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సంగీత నాటక పాఠశాల ప్రిన్సిపాల్ మార్టూరు హరిబాబు, శ్రీసాయి మంజీరా ఆర్ట్ అకాడమీ కార్యదర్శి కాజా వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గాయత్రి మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి శేషు రాణిని సన్మానించారు. సాహితీ సమాఖ్య కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, భారతీయ విద్యా భవన్ కోశాధికారి రామ్ సుభాష్, హిందూ కళాశాల తెలుగు విభాగాధిపతి ఎల్లాప్రగడ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ హేమాంబ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసి డబ్బుతో పరారైన నిందితుడి అరెస్ట్

- డబ్బు రికవరీ
- 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు
- వివరాలు వెల్లడించిన సీఐ ప్రభాకరరావు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ సంధ్యరాణి, వెనుక ముసుగులో నిందితుడు

మాచర్ల: పొలం రిజిస్ట్రేషన్‌కు ఇవ్వాల్సిన డబ్బు తీసుకుని ఉడాయించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజు రిమాండ్ విధించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రభాకరరావు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, తుక్కుగూడ గ్రామానికి చెందినా బండెల నరసింహా రెడ్డికి దుర్గి మండలంలోని, ముటుకూరు గ్రామ శివారులో 6.88 ఎకరాల పొలం ఉంది. దీన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా మాచర్ల టౌన్‌కు చెందిన చింతా శ్రీనివాసరావు పరిచయం అయ్యాడు. 2022లో పొలం అమ్మకం విషయంలో చిత్తూరు జిల్లాకు చెందిన మైలా మల్లేష్ యాదవ్, సదరు మధ్యవర్తిగా ఉన్నాడు. నరసింహారెడ్డి తన పొలాన్ని దుర్గి మండలానికి చెందిన మాదాసు వెంకటేశ్వర్లుకు రూ.70.50 లక్షలకు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి అడ్వాన్సుగా రూ.45 లక్షలు మాదాసు వెంకటేశ్వర్లు, మల్లేష్ యాదవ్‌కి ఇచ్చారు. అందులో రూ.15 లక్షలు తన వద్ద పెట్టుకొని రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాతే ఇస్తాను అని మల్లేష్ యాదవ్ నమ్మించాడు. అది నమ్మి నరసింహారెడ్డి మార్చి 15న తన పొలంలో మాదాసు వెంకటేశ్వర్లు పేరిటా రిజిస్ట్రేషన్ చేశాడు. నిందితుడి తన వద్ద ఉన్న ఫిర్యాదికి చెందిన రూ.15 లక్షలు, మాదాసు వెంకటేశ్వర్లు వద్ద నుంచి రావాల్సిన రూ.25.50 లక్షలు మొత్తం రూ.40.50 లక్షలు తీసుకొని రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుంచి పరిపోయాడు. నిందితుడికి ఫిర్యాది ఎన్ని సార్లు ఫోన్ చేసిన స్పందించక పోవడంతో మోసపోయినట్లు గ్రహించి సదరు విషయం గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ పి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సంధ్య రాణి దర్యాప్తు చేపట్టారు. టెక్నాలజీని ఉపయోగించి నిందితుడిని చిత్తూరు జిల్లాలో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి నగదు రికవరీ చేసి మాచర్ల కోర్టులో హాజరు పరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

వలంటీర్లకు దగా దినంగా ఉగాది

- పండుగ పూట వస్తుండి నిరసనలు
- వలంటీర్ల సంఘ రాష్ట్ర నేతల పిలుపు

నరసరావుపేట: వలంటీర్ల దగా దినంగా ఉగాదిని పాటించాలని ఏపీ వలంటీర్ల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్, రాష్ట్ర అధ్యక్షులు హుమాయున్ బాషా శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ఎన్నికలలో కూటమి నేత చంద్రబాబు నాయుడు వలంటీర్లకు అరచేతిలో వైకుంఠం చూపే హామీలు ఇచ్చినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. పండుగ రోజు పూట వస్తుండి నిరసనలు తెలియజేయాలని కోరారు. గతేడాది ఉగాది రోజున నూతన పట్టు వస్త్రాలు ధరించి నుదుటి బొట్టుతో కూటమినేత చంద్రబాబు వలంటీర్లను ఉద్దేశించి, వారిని ఊరిస్తూ బూటకపు హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో వలంటీర్లే కాక పథకాలు అందక దగా పడిన రైతులు, తల్లులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత అందరూ నిరాశ చెందక వచ్చే 29, 30 తేదీలలో విజయవాడ, ఇతర జిల్లా కేంద్రాలలో ఈ నిరసన ఉద్యమంలో పాల్గొని గాంధేయ పంథాలో నిరాహార దీక్ష చేసి, కూటమి మోసాలను ఎండగట్టాలని, పోరాటం కొనసాగించే దీక్ష కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పోక్సో కేసుల్లో సున్నితత్వం అవసరం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి

గుంటూరులీగల్: పోక్సో చట్టం ప్రకారం బాధితులకు ఎలాంటి సహాయం అందించాలి, ఇటువంటి కేసులలో సున్నితత్వం అనేది ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం గుంటూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గుంటూరు పోక్సో కోర్ట్ న్యాయమూర్తి ఏ అనిత మాట్లాడుతూ బాధిత మహిళా, చైల్డ్ కానీ న్యాయం కోసం కేసు ఫైల్ చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించినపుడు నేరం చేసిన వారికి శిక్ష విధించి బాధితులకు న్యాయం చేయగలమని వెల్లడించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గుంటూరు సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ కేసుల్లో బాధితులకు నల్సా పరిహార పథకం, లైంగిక దాడులకు గురైన వారికి రక్షణ పథకం 2012 ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం అందించే పరిహార పథకం 2015 ద్వారా పరిహారం ఎలా పొందవచ్చునో వివరించారు. గుంటూరు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయలక్ష్మి, ట్రైనీ న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, పోలీస్ సిబ్బంది, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నదుల సంరక్షణ ముఖ్యం

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గుంటూరు సహకారంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ హిమనీ నదుల సంరక్షణ అనేది చాలా ముఖ్యమని అన్నారు. బొగ్గు, చమురు వనరులను తగ్గించి సహజ వనరులకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా నీరు లేక ప్రజల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రాబోవు తరాలకు నీటి విలువను తెలియజేయాలన్నారు. ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ వలన పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. అన్ని అవసరాలకు మున్సిపల్ వాటర్ వాడుకొని తాగునీటికి మినరల్ వాటర్ వాడుతున్నామని, ఖాళీ స్థలాల్లో ఇళ్లు నిర్మించడం, మొక్కలను పెంచకపోవడం ప్రపంచం బాగుండాలంటే ఇప్పటి తరం అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి నీటిని సంరక్షించడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గుంటూరు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎండీ నజీనా బేగం, గుంటూరు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ బి.ఆదిశేషయ్య, ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన అఖిల భారత పత్తి పథకం వార్షిక సమావేశం

గుంటూరు రూరల్: అఖిల భారత పత్తి పంట పరిశోధన పథకం (ఏఐసీఆర్‌పీ) వార్షిక సమావేశం రెండవ రోజు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాంలో కొనసాగింది. కార్యక్రమాన్ని భారత దేశ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) క్రాప్స్ సైన్స్ విభాగం డీడీజీ డాక్టర్ డీకే యాదవ్ ప్రారంభించారు. అనంతరం నిపుణులు, శాస్త్రవేత్తలు, విత్తన పరిశ్రమ పరిశోధకులు, పత్తి పంట పురోగతి, భవిష్యత్తుపై చర్చించారు. నాగపూర్‌కు చెందిన ఐసీఏఆర్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాటన్ నుంచి క్రాప్ ప్రొటెక్షన్ విభాగం హెడ్ డాక్టర్ గజనన్ టి.బహిరే పత్తి ఏఐసీఆర్‌పీ వార్షిక నివేదికను వివరించారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (వాణిజ్య పంటలు), డాక్టర్ ప్రశాంతకుమార్‌దాస్ మాట్లాడుతూ పత్తి ఉత్పత్తి నాణ్యత, స్వల్ప పంటకాల రకాలు, వ్యర్థం లేని ఉత్పత్తి కీలక పాత్రపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పత్తి ప్రాజెక్ట్ మానిటరింగ్, అడ్వైజరీ కమిటీ (పీఎమ్ఏసీ) చైర్మన్ డాక్టర్ సీడీ మయి మాట్లాడుతూ రెండవ పత్తి టెక్నాలజీ మిషన్ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ డీకే యాదవ్ మాట్లాడుతూ భారతదేశపు పురాతన సమన్వయ పరిశోధనా కార్యక్రమాల్లో ఒకటైన ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ కాటన్ రీసెర్చ్ ప్రాజెక్ట్ (ఏఐసీఆర్‌పీ) ప్రాముఖ్యతను వివరించారు. కస్తూరి కాటన్ ఇనిషియేటివ్‌ను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఏఐసీఆర్‌పీ వార్షిక నివేదిక, బీటీ పత్తి ఇవాల్యూయేషన్ నివేదిక, ఆర్గానిక్ పత్తి ఉత్పత్తి సాంకేతిక గైడ్ వంటి అనేక ప్రచురణలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి, నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.